- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
02-06-2026

సంపుటి : 01 సంచిక : 71 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 71 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

# ధూమపానంలో..చైనా టాప్

**ఏడాదికి ప్రపంచంలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్ల అమ్మకం**

- అందులో 2.4 ట్రిలియన్ల సిగరెట్లు కాల్చేస్తున్న చైనీయులు
- అంకెల్లేకుండా పెరిగిపోతున్న సిగరెట్ రాయుళ్లు

ప్రపంచవ్యాప్తంగా ధూమపానం అలవాటుపై అవగాహన పెరుగుతుండటంతో సిగరెట్ల వినియోగం రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. కానీ మన పొరుగు దేశమైన చైనాలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా, అత్యంత భయానకంగా మారుతోంది. బీజింగ్ నుంచి తాజాగా విడుదలైన అధికారిక నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధికంగా సిగరెట్లు తాగే దేశంగా చైనా అగ్రస్థానంలో నిలిచింది. చైనా జనాభాలో ప్రతి వంద మందిలో 23 మంది చొప్పున (అంటే దాదాపు 23 శాతం మంది) సిగరెట్లకు బానిసలయ్యారు. చైనా మొత్తం జనాభా సుమారు 140 కోట్లు కాగా.. ఇందులో దాదాపు 30 కోట్ల మంది చైనీయులు నిత్యం పొగ తాగుతూ తమ ఊపిరితిత్తులను గుల్ల చేసుకుంటున్నారు.



3 లో



## పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

- పరస్పర ఆరోపణలతో వేడెక్కుతున్న వాతావరణం

**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
పశ్చిమాసియాలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'ఆత్మరక్షణ' పేరుతో ఇరాన్ రాడార్, కమాండ్ కంట్రోల్ కేంద్రాలపై అమెరికా దాడులు చేసింది. అంతర్జాతీయ జలాలలో పనిచేస్తున్న ఎంక్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని, టెహ్రాన్ దుందుడుకు చర్యలకు ప్రతిగానే ఈ దాడులు చేశానని అమెరికా సమర్థించుకుంది. 'ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌ను, రెండు డ్రోన్లను అమెరికా యుద్ధ విమానం ధ్వంసం చేసింది' అని సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇదిలావుండగా ఇరాన్‌లోని సిరిక్ దీవిలో ఉన్న టెలీకమ్యూనికేషన్ టవర్‌పై దాడి చేసేందుకు ఉపయోగించిన అమెరికా వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలియజేసింది.

-మిగతా 3 లో




## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు

**హైదరాబాద్, జూన్ 1 (మహాప్రభ):**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు.

-మిగతా 3 లో

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం**





- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

**ఆదిలాబాద్ జూన్ 1 (మహాప్రభ):**
ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం.

-మిగతా 3 లో





## దోమలతో గూగుల్ వినూత్న ప్రయోగం..

- అమెరికాలో 6.4 కోట్ల బయో దోమలు రిలీజ్
- దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టు

**న్యూయార్క్:జూన్ 1 (మహాప్రభ):**
గూగుల్ సంస్థ ఓ వినూత్న ప్రయోగానికి తెరలేపింది. దోమల( ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ సంస్థ పూనుకున్నది . దీనిలో భాగంగా ప్రయోగశాల్లో అభివృద్ధి చేసిన సుమారు 6.4 కోట్ల బయో దోమలను అమెరికాలో రిలీజ్ చేయనున్నది. తొలుత ఈ ప్రాజెక్టును ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో చేపట్టనున్నది. దీని కోసం ప్రభుత్వం అనుమతి కోరింది గూగుల్ సంస్థ. అసలైన దోమల జనాభాను నియంత్రించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. వ్యాధికారక దోమల జనాభాను తగ్గించనున్నారు. గూగుల్ ప్లానింగ్‌కు చెందిన అంశం ప్రస్తుతం యూఎన్ పర్యావరణ పరిరక్షణ సంస్థ(ఈపీఏ) ఆధీనంలో ఉన్నది. రాబోయే

-మిగతా 3 లో

## పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ



3 లో

## ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు



- పేచీ కేవలం అక్కడి నాయకులతోనే
- ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం
- పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్ జూన్ 1 (మహాప్రభ):**
ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య

-మిగతా 3 లో

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

- సెలవుల తర్వాత విచారిద్దామంటూ వాయిదా




**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
ప్రస్తుతమున్న పెన్ను -- పేపర్ తరహాలో బదులుగా కంప్యూటర్ బేస్డ్ తరహాలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఆదేశించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ దశలో పరీక్ష నిర్వహణా తీరును మార్చడం వల్ల ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. పేపర్ లీకయిందనే ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన

-మిగతా 3 లో

# దేశభక్తి సినిమాలో చూపించడం కాదు..

**నిజజీవితంలో చూపించు పవన్ కళ్యాణ్**



పవన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

- ఆ తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలి
- తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడితే సహించం
- ఆయన బీజేపీ ఎజెండా మోయడం శోచనీయం
- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట,జూన్ 1 (మహాప్రభ):**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని

-మిగతా 3 లో



## ఎల్పీజీ ధరల మోత

- వాణిజ్య సిలిండర్‌పై రూ.42 పెంపు
- ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్‌పై రూ.11 వడ్డన
- దేశ ప్రజలకు మోడీ సర్కారు మరో షాక్

**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
కేంద్రంలోని మోడీ సర్కారు ఒకటో తారీఖున దేశ ప్రజలకు మరోసారి షాకిచ్చింది. దేశంలో ఎల్పీజీ ధరలు మళ్లీ పెంచింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.42 పెంచింది. దీంతో ఢిల్లీలో ఒక సిలిండర్ ధర రూ.3,113.50కు చేరింది. అలాగే ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ సిలిండర్‌పై కూడా రూ.11 పెరిగి.. ధర రూ.821.50కు ఎగబాకింది. పెరిగిన ధరల ప్రభావాన్ని వ్యాపార సంస్థలు, చిన్న హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు,

-మిగతా 3 లో

## ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

- ప్రతికూల శక్తుల నుంచి ?రాష్ట్రాన్ని కాపాడుకోవాలి :
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్ష లు



**హైదరాబాద్ జూన్ 1 (మహాప్రభ):**
రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.
రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ మేరకు కేసీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో,

-మిగతా 3 లో

## ఇక టీవీకే, డీఎంకే మధ్యనే పోరు..
# అన్నాడీఎంకేకు చోటుండదు


**- తమిళనాడు సీఎం విజయ్**



**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
తమిళనాడు లో రాజకీయ పోరు ఇకపై టీవీకే, డీఎంకే మధ్య మాత్రమేనని, అన్నాడీఎంకే కు చోటుండదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని వ్యాఖ్యానించారు. తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని అన్నారు.రాజకీయంగా చెబుతున్నా. ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు' అని విజయ్ చెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్.. అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ని, మీ అన్నని, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు' అని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా.. ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్లు ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. సూట్ ఎందుకు వేసుకోకూడదని విజయ్ ప్రశ్నించారు.

# తమిళనాడులో మరో కొత్త పార్టీ?

**- బీజేపీ నేత అన్నామలై పోస్టర్లపై చర్చ**





**చెన్నై: న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
తమిళనాడులో మరో కొత్త పార్టీ ఆవిర్భవించనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చర్చ జరుగుతున్నది. 'నిర్భయ మనస్సులకు పరిమితులు ఉండవు' అన్న పేరుతో కోయంబత్తూరు అంతటా ఆయన పోస్టర్లు వెలిశాయి. రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాన్ని కోయంబత్తూరులో బీజేపీ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ పరిణామం జరుగడం విశేషం.కాగా, అన్నామలై కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పటి వరకు రెండు రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాలకు ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో అన్నామలై అభిమాన సంక్షేమ సంఘమైన 'అన్నామలై అన్బు కూట్టం' కొత్త పార్టీ ఊహాగానాలకు తెరతీసింది. కొత్త సభ్యులను, కార్యవర్గ సభ్యులను చేర్చుకుంటున్నట్లు ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. అలాగే బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను ఢిల్లీలో అన్నామలై కలిసి ఆ పార్టీకి ఆయన రాజీనామా చేయనున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం చేసిన ఒక ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. 'తమిళనాడులో మరో రాజకీయ పార్టీ రాబోతోంది. మార్పులు వేగవంతమవుతున్నాయి. (ఎంఎస్ -- ప్రతిపాదిత పేరులో ఒక ఆసక్తికరమైన తర్కం ఉన్నది)' అని ఆయన ట్వీట్ చేశారు.

## జమ్ముకశ్మీర్‌లో గడిచిన మూడు
# దశాబ్దాల్లో 'ఉగ్ర' మరణంలేని నెల ఇదే..!



**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
జమ్ముకశ్మీర్ భద్రతా చరిత్రలో ఒక చారిత్రక మైలురాయి నమోదైంది. గడిచిన మూడు దశాబ్దాలకుపైగా కాలంలో తొలిసారిగా, ఉగ్రవాద సంబంధిత హింసలో ఒక్క మరణం కూడా నమోదు కాకుండా ఒక నెల గడిచింది. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ వంటి స్వతంత్ర ట్రాకర్లతోపాటు అధికారిక గణాంకాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.జాతీయ మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికల ప్రకారం.. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే సంభవించాయి. అందులో 10 మంది ఉగ్రవాదులు, ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కాలంలో ఒక్క సామాన్యుడు కూడా ప్రాణాలు కోల్పోలేదు. గతంతో పోలిస్తే ఇది చాలా మెరుగైన పరిస్థితి. ఇక ఈ మే నెలలో ఎలాంటి ఉగ్రవాద సంబంధ మరణం చోటుచేసుకోలేదు. ఉదాహరణకు 2001 మే నెలలో దాదాపు 300 మంది, 2025 మే నెలలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు నిరంతరాయంగా చేపడుతున్న కౌంటర్-టెర్రరిజం ఆపరేషన్లు, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం, ఉగ్రవాదులకు స్థానిక మద్దతు తగ్గడం వంటి కారణాలవల్లే ఈ మార్పు సాధ్యమైందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి తర్వాత భద్రతను కట్టుదిట్టం చేసి, ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉగ్ర మరణాలులేని నెలగా 2026 మే నిలవడం శాంతి, స్థిరత్వం దిశగా ఒక సానుకూల సంకేతమని నిపుణులు భావిస్తున్నారు.

## పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడంలో
# భారత్ కీలకపాత్ర పోషించాలి



**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారత్ అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు.పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణావల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయని రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉందని, ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారని నెతన్యాహు సంతోషం వ్యక్తంచేశారు.

# ఢిల్లీకి కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు..

**-జూన్ 6న నిరసన ప్రదర్శన**




**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 6వ తేదీన ఇండియా రానున్నాడు. ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాల అంశంలో నైతిక బాధ్యత తీసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిర్వహించే శాంతియుత ప్రదర్శనలో ఆయన పాల్గొననున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీప్కే ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఢిల్లీలో జరిగే ఆ నిరసన కార్యక్రమంలో మద్దతుదారులు, విద్యార్థులు పాల్గొవాలని పిలుపు ఇచ్చారు. అందరం దగ్గరకు రావాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగం అడుగుజాడల్లో.. మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా డిమాండ్ కోరుదామన్నాడు. మనం మన గళం విప్పితే, దానికి వాళ్లు తప్పకుండా వింటారన్నారు.జూన్ 6వ తేదీన తన మద్దతుదారులందరూ విమానాశ్రయానికి చేరుకోవాలని తన వీడియో మెసేజ్‌లో పిలుపునిచ్చారు. జూన్ 6, శనివారం ఉదయం నేను ఢిల్లీకి చేరుకుంటానని, అందరూ విమానాశ్రయానికి రావాలని, కలిసికట్టుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్దామని దీప్కే అన్నాడు. జంతర్ మంతర్‌లో శాంతియుత ప్రదర్శన కోసం పర్మిషన్ అడుగుదామన్నాడు. నీట్, సీబీఎస్ఈ లాంటి పరీక్షల సంబంధిత వివాదాల వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని దీప్కే అన్నారు. సోషల్ మీడియా ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ పార్టీని సబ్‌స్క్రైబ్ చేస్తున్న వారి సంఖ్య కూడా కోట్లకు చేరుకున్నది.

## భర్తపై యాసిడ్ దాడి..
## కంటి చూపు కోల్పోయిన భర్త..

**- భార్యకు కోర్టు ఏ శిక్ష విధించిందంటే**



**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
భర్తపై యాసిడ్ దాడి చేసిన భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది కోర్టు. అంతేకాదు.. ఆమెకు రూ.1.75 లక్షల జరిమానా కూడా విధించింది. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని శంభల్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కఖాన్నా అనే మహిళకు, ముజఫ్ఫర్ అనే వ్యక్తికి కొన్నేళ్లక్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే, భార్యాభర్తల మధ్య తరచూ విబేధాలు, వాగ్వాదం చోటు చేసుకునేవి.ఇదే సమయంలో కఖాన్నాకు వేరొకరితో వివాహేతర సంబంధం కూడా ఉంది. దీంతో ఆమె భర్త నుంచి విడాకులు ఇవ్వాలని కూడా కోరుకుంది. అయితే, భర్తతో గొడవలు, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో గత ఏడాది మార్చి 7న అతడిని హత్య చేయాలనుకుంది. ఇందుకోసం ఇంట్లో నిద్రిస్తున్న భర్త ముజఫ్ఫర్‌పై యాసిడ్ పోసింది. ఈ దాడితో మేల్కొన్న ముజఫ్ఫర్ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయినా అతడి భార్య కఖాన్నా వదలకుండా మళ్లీ యాసిడ్ పోసింది. అది మీద పడటంతో ముజఫ్ఫర్ కంటి చూపు కోల్పోయాడు. అప్పుడు అక్కడి నుంచి తప్పించుకున్న భర్త.. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి కారణమైన భార్య కఖాన్నాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుపై శంభల్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ విచారణ జరిపింది. కఖాన్నా నేరం చేసినట్లు రుజువైంది. దీంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సోమవారం తుది తీర్పు వెల్లడించింది. జస్టిస్ గోపాల్ ఈ తీర్పు వెల్లడించారు. దీని ప్రకారం కఖాన్నాకు జీవిత ఖైదు విధించారు. అంతేకాదు.. రూ.1.75 లక్షల జరిమానా కూడా చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## మీరు హాయిగా
## కూర్చుని విశ్రాంతి తీసుకోండి..



**న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
: పశ్చిమాసియాలో మారుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలనుకుంటోంది అని సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవడం వల్ల.. వాషింగ్టన్‌తోపాటు దాని మిత్ర దేశాలకు కూడా మంచి జరుగుతుందని ఆయన అన్నారు. ఆయన చేసే నిర్ణయాలకు తన సొంత పార్టీలో వారు గానీ, రాజకీయ ప్రత్యర్థులు (డెమోక్రాట్లు) కానీ తనకు మద్దతు ఇవ్వకపోవడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారినుద్దేశించి 'మీరు వాదించకుండా.. హాయిగా కూర్చొని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోండి' అంటూ కామెంట్ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కాగా, 'ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోంది. అది అమెరికాకు, మాతో ఉన్నవారికి మంచి ఒప్పందం అవుతుంది. అయితే ఈ సమయంలో.. డెమోక్రాట్లు కానీ, దేశభక్తి లేనివారిలా కనిపించే పలువురు రిపబ్లికన్లకు ఒక విషయం అర్థం కావడం లేదా? యుద్ధం విషయంలో నేను మరింత వేగంగా ముందుకెళ్లాలని, లేదా నెమ్మదిగా వెళ్లాలని, లేదా యుద్ధానికి వెళ్ళాలని, లేదా యుద్ధానికి వెళ్ళకూడదని, లేదా ఇంకేదైనా చేయాలి అని రాజకీయ దళారులు మునుపెన్నడూ లేని స్థాయిలో పదే పదే నాపై ప్రతికూలంగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అలాంటప్పుడు నా పనిని సవ్యంగా చేయడం.. చర్చలు జరపడం నాకు చాలా కష్టతరం అవుతుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్‌ని తనని విమర్శించే వారిని దృష్టిలో పెట్టుకుని పరోక్షంగా.. 'మీరు హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోండి, చివరికి అంతా మంచే జరుగుతుంది.. ఎప్పుడూ అలాగే జరుగుతుంది.. ఓపిక, విశ్వాసంతో ఉండాలి' ట్రంప్ తన ట్రూత్ పోస్టులో ప్రత్యర్థుల్ని కోరారు.

## 80 ఏళ్ల వృద్ధురాలిపై..
## పొరుగు వ్యక్తి అత్యాచారం




**లక్నో న్యూఢిల్లీ జూన్ 1 (మహాప్రభ):**
పొరుగున నివసించే వ్యక్తి, 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు రావడం చూసి అతడు పారిపోయాడు. రక్తస్రావంతో ఉన్న ఆ వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో 80 ఏళ్ల వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని పొరుగున నివసించే 26 ఏళ్ల వ్యక్తి గమనించాడు. బలవంతంగా ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.కాగా, ఆ వృద్ధురాలు సహాయం కోసం కేకలు వేసింది. దీంతో స్థానికులు అక్కడకు రావడంతో ఆ వ్యక్తి పారిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత నిందితుడైన ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వృద్ధురాలి కుటుంబం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ధూమపానంలో..చైనా టాప్

సగానికి సగం చైనీయులే..

షాకింగ్ విషయమేమిటంటే.. ప్రపంచవ్యాప్తంగా ఒక ఏడాదిలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్లు అమ్ముడవుతుంటే.. అందులో సగానికి సగం అంటే ఏకంగా 2.4 ట్రిలియన్ల సిగరెట్లను కేవలం చైనా ప్రజలే తాగేస్తున్నారు. 2003 నుంచి 2023 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా సిగరెట్ల వినియోగం 26 శాతం తగ్గితే.. అదే సమయంలో చైనాలో మాత్రం ఈ వినియోగం ఏకంగా 39 శాతం పెరగడం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ధూమపానానికి వ్యతిరేకంగా ఎంత పెద్ద యుద్ధం ప్రకటించినా, చైనాలో పొగ సెగలు మాత్రం అస్సలు తగ్గడం లేదు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి 2022 లో జిన్‌పింగ్ ప్రభుత్వం సిగరెట్లపై అదనంగా 10 శాతం పన్ను విధించడమే కాకుండా, యువతను ఆకర్షిస్తున్న ఈ-సిగరెట్ల పై కూడా కఠినమైన



నిషేధ ఆంక్షలు విధించింది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ చట్టాలు సరిగ్గా అమలు కాకపోవడంతో ఫలితం శూన్యంగా మారింది.

చచచ ప్రభుత్వ ద్వంద్వ నీతితోనే..

డ్రాగన్ దేశంలో ఇన్ని చట్టాలు ఉన్నా సిగరెట్ల వినియోగం తగ్గకపోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రభుత్వ ద్వంద్వ నీతి, భారీ వ్యాపార ప్రయోజనాలేనని నిపుణులు చెప్తున్నారు. చైనాలో సిగరెట్ల ఉత్పత్తి, అమ్మకాల మొత్తం వ్యవహారాలను ప్రభుత్వ అధీనంలోని 'చైనా నేషనల్ టొబాకో కార్పొరేషన్' అనే ఒకే ఒక్క సంస్థ చూసుకుంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పొగాకు కంపెనీ అయిన దీని లాభాలు వింటే ఎవరికైనా మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. కేవలం 2025 ఆర్థిక సంవత్సరంలోనే ఈ కంపెనీ ఏకంగా 244 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ఈ కంపెనీ ద్వారా వచ్చే ఆదాయం చైనా ప్రభుత్వ మొత్తం వార్షిక ఆదాయంలో ఏకంగా 7 శాతంగా ఉంది. కరోనా మహమ్మారి సంక్షోభం తర్వాత చైనా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పుడు, దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి ఇదే పొగాకు కంపెనీని చైనా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. ఒకవైపు ప్రజల ఆరోగ్యం కోసం పొగ తాగొద్దని చెప్తూనే.. మరోవైపు ప్రభుత్వ ఖజానా నింపటానికి సిగరెట్ల అమ్మకాలను పరోక్షంగా పెంచడం వల్లే చైనాలో ఈ పొగాకు మహమ్మారిని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్‌ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

మొదటి తరువాయి

ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు. ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్‌ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్‌ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు. టీఆర్‌ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

మొదటి తరువాయి

నీట్-యుజి 2026 పరీక్షను మే 12న దేశవ్యాప్తంగా రద్దు చేశారు. సిబిఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టింది. జూన్ 21న తాజా విచారణ జరగాల్సి వుంది. పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ తిరస్కరించింది. జులై వరకు ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆర్‌జెడి ఎంఎల్‌ఎ సుధాకర్ సింగ్ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించింది. సిబిటి తరహాలో పరీక్ష నిర్వహిస్తే పేపర్ లీక్ అయ్యే సమస్య తలెత్తదని పిటిషనర్ వాదించారు. ఇంత తక్కువ కాల వ్యవధిలో పరీక్షను మళ్లీ నిర్వహించడంలో వుండే ఇబ్బందులను ప్రస్తావిస్తూ, వారికి వుండే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని సిబిటి లాంటి అంశాలను తోసిపుచ్చినట్లు బెంచ్ తెలిపింది. పేపర్ లీకయినప్పటికీ మళ్లీ పెన్ను పేపర్ తరహాలోనే పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారా అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించగా, పరీక్షల నిర్వహణా అధికారులు ఎదుర్కొనే రవాణా పరమైన ఇబ్బందులను కూడా బెంచ్ ప్రస్తావించింది. అయినా పిటిషనర్ పట్టుబడుతుండడంతో తక్షణమే ఈ అంశాన్ని విచారించలేమని కోర్టు తెలిపింది. కోర్టు పాక్షిక పని దినాలు ముగిసిన తర్వాత దీనిని విచారణకు పెట్టాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల తర్వాత విచారిద్దామని బెంచ్ తెలిపింది. ఎన్‌టిఎ పనితీరులో, పోటీ పరీక్షల నిర్వహణలో విస్తృత సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలై, పెండింగ్‌లో వున్న పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను కూడా కలిపారు.

# ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

మొదటి తరువాయి

ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని హెచ్చరించారు. ప్రతీప శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని తెలిపారు. తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోవాలనీ, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కోరారు.

# దేశభక్తి సినిమాలో చూపించడం కాదు..

మొదటి తరువాయి

డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ



ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు.

బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

### నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ



హైదరాబాద్

జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్‌ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్‌ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

మొదటి తరువాయి

అమెరికా వైమానిక స్థావరం ఉన్న కువైట్‌పై కూడా క్షిపణి, డ్రోన్ దాడులు జరిగాయి. దీంతో ఆ దేశం తన గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేసింది. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య అడపాదడపా పోరు జరుగుతూనే ఉన్న విషయం తెలిసిందే.

**ఎంఓయూలో ట్రంప్ మార్పులు**

మరోవైపు అమెరికా'ఇరాన్ మధ్య అవగాహనా ఒప్పం దం (ఎంఓయూ)పై చర్చలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత ఎంఓయూకు కొన్ని మార్పులు సూచిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిని తిప్పిపంపారు. మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణను కొనసాగించాలని, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని ఎంఓయూలో ప్రతిపాదించారు. తాజా దాడులను అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించిన తర్వాత ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'నిజంగా ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ అనుకుంటే అది అమెరికాకు, మాతో ఉన్న వారికి మంచి చేసేదిగా ఉండాలి' అని వ్యాఖ్యానించారు. చర్చలపై ప్రతికూల విమర్శలు చేస్తున్న వారిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు హాయిగా కూర్చోండి. విశ్రాంతి తీసుకోండి. చివరికి అంతా మంచే జరుగుతుంది. ఎప్పుడూ అలాగే జరుగుతుంది' అని తెలిపారు. కాగా ఎఎంఓయూలో ట్రంప్ సూచించిన మార్పులేమిటో తెలియరాలేదు. అయితే ఇరాన్ అణు కార్యక్రమం పైన, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం పైన ఆయన కఠిన వైఖరితో ఉన్నారని అధికారులు చెప్పారు. ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక వెసులుబాట్లు ఇవ్వాలనే విషయంపై కూడా ట్రంప్ ఆలోచిస్తున్నారని వారు తెలిపారు.

# దోమలతో గూగుల్ వినూత్న ప్రయోగం..

మొదటి తరువాయి

రెండేళ్లలో ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో ల్యాబ్‌లో పెరిగిన మగ దోమలను వాతావరణంలోకి రిలీజ్ చేయనున్నారు.దోమల నియంత్రణ కోసం గూగుల్ సంస్థ డీబగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టును 2014లో ఆవిష్కరించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టును అప్పట్లో ప్రారంభించారు. రసాయనాలు, క్రిమిసంహారకాలపై ఆధారపడకుండా. . సహజసిద్దమైన బ్యాక్టీరియా వోల్‌బాచియా పిపెంటిస్ ద్వారా ప్రమాదకర దోమలను అంతం చేయాలని భావిస్తున్నారు. మగ దోమలకు ఆ బ్యాక్టీరియాను ఎక్కిస్తారు. ఆ తర్వాత వాటిని అడవుల్లోకి రిలీజ్ చేస్తారు. అయితే ఆడ, మగ దోమలు కలిసిన తర్వాత వచ్చే గుడ్లు ఫలదీకరణ చెందవని గూగుల్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇక పదేపదే ఈ ప్రయోగం చేపట్టడం వల్ల వ్యాధికారక దోమల జనాభాను తగ్గించే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. కేవలం ఆడ దోమలు మాత్రం మనుషులను కుడుతుంటాయి. ఇక అడవుల్లోకి రిలీజ్ చేసిన మగ దోమలు మనుషులను కుట్టవు. అంటే ఈ ప్రయోగం వల్ల దోమల నుంచి సంభవించే అనర్థాలు తక్కువే అని గూగుల్ సంస్థ చెబుతోంది. ఇంతకీ ఈ ప్లాన్ వర్కౌట్ అవుతుందో లేదో చూద్దాం. గూగుల్ సంస్థ సుమారు 3.2 కోట్ల దోమలను ప్రతి ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నది. దీని ద్వారా మొత్తం 6.4 కోట్ల దోమలను పర్యావరణంలోకి రిలీజ్ చేస్తారు. పరిశోధనశాల్లో వోల్బాచియా బ్యాక్టీరియా ఎక్కించిన మగదోమలను దశలవారీగా విడుదల చేయనున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్టుకు అప్రూవల్ దక్కితే, అప్పుడు దోమల నియంత్రణ కోసం అమెరికా చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టు ఇదే అవుతుంది. ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం ఈపీఏ పరిశీలన చేస్తున్నది. పబ్లిక్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. ఇప్పటి వరకు కచ్చితంగా ఏ ప్రదేశంలో ఆ దోమల్ని రిలీజ్ చేస్తారన్న విషయాన్ని వెల్లడించలేదు. గతంలో ఇలాంటి పద్ధతి ద్వారా దోమల నియంత్రణ చేపట్టినట్లు తెలుస్తోంది. వోల్బాచికా బ్యాక్టీరియా విధానాన్ని అనేక దేశాలు అమలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే పద్ధతిలో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకుపైగా దోమలను రిలీజ్ చేసినట్లు గూగుల్ సంస్థ చెబుతోంది. ఈ ప్రయోగం వల్ల దోమల జనాభాను తగ్గించారు. వ్యాధికారక దోమలు కూడా తగ్గాయి.ద

# ఎల్పీజీ ధరల మోత

మొదటి తరువాయి



హాస్టళ్లు వంటి వాణిజ్య వినియోగదారులు నేరుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ అదనపు భారం చివరకు వినియోగదారుల పైనే పడే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో పెరిగిన నిత్యావసర ధరలతో ఆర్థికంగా పెను భారాన్ని మోస్తున్న సామాన్యుడికి.. గ్యాస్ ధరల వరుస వడ్డనలు మరింత షాక్ ఇస్తున్నాయి.

# సంపాదకీయం

## తెలంగాణ మేధావులు ఆలోచించాలి !




తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..
# మార్కెట్ యార్డుల్లో రైతుల ఆందోళన

-కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను తక్కువ చేసి చూస్తోంది
-ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

**శివంపేట/నర్సాపూర్, జూన్ 1 (మహాప్రభ):** ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20 నుంచి 30 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ లారీలు రాకపోవడం, ధాన్యం తరలింపు జరగకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయి ఉండగా, అకాల వర్షాల భయంతో రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. కొందరు రైతులు కాంటా వేసి రోజుల తరబడి ఎదురుచూస్తున్నా ధాన్యం తరలింపు జరగడం లేదని వాపోతున్నారు. వర్షాలు కురవడంతో ఇప్పటికే కొంత ధాన్యం తడిసిపోయి నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు.



ఈ పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను తక్కువ చేసి చూపుతోందని ఆరోపించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పేవారు ఒకసారి మార్కెట్ యార్డులకు వచ్చి వాస్తవ పరిస్థితులు చూడాలని సవాల్ విసిరారు. ఒక మార్కెట్ యార్డులోనే ఇంత దయనీయ పరిస్థితి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. రైతులు బోనస్ సంగతి పక్కనపెట్టి, కనీసం తాము తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి తరలించాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన వెంటనే ట్రక్ షీట్లు జారీ చేసి రైతులను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని, అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, వర్షాల వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని వారు డిమాండ్ చేశారు.

# 56వ సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ
# వేడుకలు ఘనంగా నిర్వహణ.

**ఎల్ బి నగర్ 1 జూన్ (మహాప్రభ)**
కార్మికుల వర్గ పోరాటాలే సమస్యలకు శాశ్వత పరిష్కారం సీఐటీయూ నాయకులు
56వ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీ ఐ టీ యూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎల్ బి నగర్ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టేపాక రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీ ఐ టీ యూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం గత 55 సంవత్సరాలుగా సీ ఐ టీ యూ నిరంతర పోరాటాలు సాగిస్తూ 56వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం కార్మిక లోకానికి గర్వకారణమని పేర్కొన్నారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై సీ ఐ టీ యూ ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సీ ఐ టీ యూ బలమైన కార్మిక సంఘంగా ఎదిగి, జీహెచ్ఎంసీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, హమాలీలు, రవాణా రంగం మరియు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మిక వర్గానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరింత ఉద్ధృతంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.






ఇళ్ల స్థలాల సమస్యపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఎల్ బి నగర్ ప్రాంతంలోని కార్మికులను సమీకరించి ప్రభుత్వ భూములను గుర్తించి కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దండు రాధ, బి. కాశయ్య, కృష్ణమూర్తి, రాథోడ్ అంజి, లింగస్వామి, రాధమ్మ, లక్ష్మణ్ నాయక్, గంగమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మండలంలో పంచాయతీ
# కార్యదర్శుల బదిలీలు, కొత్త నియామకాలు

**తూప్రాన్, జూన్ 01(మహాప్రభ)**
తూప్రాన్ మండలంలోని గ్రామ పంచాయతీల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలువురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు, నియామకాలు చేపట్టినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఎన్. సతీష్ తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు, నియామకాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. వివిధ మండలాలైన కోహెడ, చేగుంట, మనోహరాబాద్ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులను తూప్రాన్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు కేటాయించారు. అలాగే మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులను పరిపాలనా అవసరాల దృష్ట్యా ఇతర గ్రామాలకు బదిలీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం చేగుంట మండలం చెత్ల తిమ్మాయిపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి జె. రమేష్‌ను గుండ్రెడ్డిపల్లి




గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. కోహెడ మండలం వారికోల్ గ్రామం నుంచి గ్రేడ్-3 కార్యదర్శి డి. సతీష్ కుమార్‌ను కోనాయిపల్లి (పిబి) గ్రామ పంచాయతీకి నియమించారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి నుంచి గ్రేడ్-4 కార్యదర్శి పి. స్వామి గౌడ్‌ను నరసంపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. అదేవిధంగా వెంకటరత్నాపూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కె. కళ్యాణిని వెంకటాయపల్లి గ్రామానికి బదిలీ చేయగా, గుండ్రెడ్డిపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఎ. మహేశ్వరిని మల్కాపూర్ గ్రామ పంచాయతీకి నియమించారు. కోనాయిపల్లి (పిబి)లో విధులు నిర్వహిస్తున్న జె. అన్నపూర్ణను వెంకటరత్నాపూర్ గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. యావాపూర్ గ్రామంలో డెప్యుటేషన్‌పై ఉన్న గ్రేడ్-3 కార్యదర్శి చ. అరుణ డెప్యుటేషన్‌ను రద్దు చేసి కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో నియమించారు. కుల్చారం మండలం పోతిన్‌శెట్టిపల్లి గ్రామం నుంచి గ్రేడ్-4 కార్యదర్శి వి. అరుంధతిని తూప్రాన్ మండలంలోని యావాపూర్ గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులందరూ జూన్ 1వ తేదీ మధ్యాహ్నం లోపు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో విధుల్లో చేరాలని ఎంపీడీఓ ఎన్. సతీష్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ బదిలీలు, నియామకాలతో గ్రామ పంచాయతీల్లో పరిపాలనా పనులు మరింత వేగవంతం అవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కూకట్పల్లి నియోజకవర్గంలో మేకల మైఖేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ


**కూకట్పల్లి ,జూన్ 1(మహాప్రభ)**
కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ మేకల మైఖేల్ జన్మదిన సందర్భంగా



ఎస్ఎస్ఆర్ క్యాంప్ ఆఫీసులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మైఖేల్‌కు షాలువ కప్పి సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాణ్, డివిజన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రజలు, కార్యకర్తలు హాజరై మేకల మైఖేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మైఖేల్ సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, ప్రజల కోసం ఆయన మరింత సేవ చేయాలని కోరుకున్నారు.

## ఆల్ ఇండియా మేయర్స్ సమావేశానికి కరీంనగర్ మేయర్ శ్రీనివాస్‌కు ఆహ్వానం

**కరీంనగర్, ,జూన్ 1(మహాప్రభ)**
ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో జూన్ 3, 4 తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు అధికారిక ఆహ్వానం అందింది.



కౌన్సిల్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ముఖ్య అతిథిగా ఈ సమావేశం జరగనుంది. దేశవ్యాప్తంగా పలువురు మేయర్లు పాల్గొనే ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ప్రజాసేవల మెరుగుదల వంటి అంశాలపై చర్చించనున్నారు. రిషికేష్ మేయర్ రణ్‌జయ్ పాన్వర్, కార్యదర్శి మనోజ్ గుప్తా ఆహ్వానం మేరకు కరీంనగర్ తరఫున మేయర్ కొలగాని శ్రీనివాస్ ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో పాల్గొననున్నారు. కరీంనగర్ తరఫున ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని నగరపాలక వర్గాలు పేర్కొన్నాయి.

# చట్ట ప్రకారం ప్రతి బాధితుడికి న్యాయం అందిస్తాం

-కుమారుడి వేధింపులపై సీరియస్
-తక్షణ విచారణకు ఆదేశాలు
-ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుంది
-ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -01జూన్ (మహాప్రభ )**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్‌కు వినిపించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో హాజరైన ఓ వృద్ధ దంపతులు తమ కుమారుడు తమపై దాడి చేస్తూ, సరైన ఆహారం అందించకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ అత్యంత సీరియస్‌గా తీసుకుని, వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్ఐకి ఆదేశాలు జారీ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతోందని ఎస్పీ తెలిపారు.

# మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు అందించే ఆరోగ్య సేవలు బేష్

-నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా అడుగులు.
-ఆరోగ్య పరీక్షల నిర్వహించుకున్న కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్.
-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.




**మెదక్ జిల్లా -01జూన్ (మహాప్రభ )**
కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ , సౌజన్యంతో మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరము, నిర్వహించారు.మేడ్చల్ మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా రెడ్ క్రాస్ సొసైటీ ముందుకు వచ్చిందని ఈరోజు వైద్య శిబిరం ఏర్పాటు చేసి జిల్లా అధికారులతో పాటు ప్రజలకు అన్ని పరీక్షలు నిర్వహించుకున్నారని , అలాగే ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. శ్రీరాం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి శ్రీనివాస్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాస్ రావు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, ఎస్పై సత్యనారాయణ, సభ్యులు శంకర్ దయాళ్ చారి, తోట శ్రీనివాస్, వేణు పాల్గొని పేషంట్లకు సేవలందించారు.

# కొత్తపేటలో ఘనంగా నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం







**కొత్తపేట 1 జూన్ (మహాప్రభ)**
కొత్తపేటలోని శ్రీ ప్రసన్న మహంకాళి దేవాలయము ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరై కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాకుండా సమాజాన్ని ఏకం చేసే శక్తి కేంద్రాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ కళ్యాణ మండపం వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలు మరియు భక్తులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా , చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా , ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ వజీర్ ప్రకాష్ గౌడ్ , బొగ్గారపు వరుణ్ గుప్తా , స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు, ప్రముఖులు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, భక్తి వాతావరణంలో ఘనంగా సాగగా, ఆలయ అభివృద్ధి మరియు భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి.

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -01జూన్ (మహాప్రభ )**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈ నెల 2 వ తేదీ మంగళవారం , జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి డీఎస్పీ ప్రసన్నకుమార్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు తో కలిసి జిల్లా కలెక్టర్ అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఒక్కరికి తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ నేపథ్యంలో సభా ప్రాంగణం, వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, వేడుకలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ రోజు (జూన్ 02) జరగనున్న కార్యక్రమం వివరాలిలా ఉన్నాయి..
జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 7:45 గంటలకు ముఖ్య అతిథి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తారు. 8 గంటల నుంచి 8:10 గంటల లోపు జాతీయ జెండాను ఆవిష్కరించాక, పోలీస్ శాఖచే గౌరవ వందనం స్వీకరిస్తారు.అనంతరం 8:10 గంటల నుంచి 8:30 గంటల వరకు జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథిలి ప్రసంగపాఠం చదివి వినిపిస్తారన్నారు. ఈ సందర్భంగా 8:30 గంటల నుంచి 8:45 వరకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో తెలంగాణ రాష్ట్ర సాధనను స్ఫురింపజేసే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.8:45 గంటల నుంచి 9 గంటల వరకు అమరవీరులకు సన్మానం వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

# రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై కేటీఆర్‌తో భేటీ

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్





**గడ్డి అన్నారం 1 జూన్ (మహాప్రభ)**
గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ , ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి తో కలిసి, బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి మరియు ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ బలోపేతం, అలాగే ఎల్ బి నగర్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, ప్రజలకు పార్టీ మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా ఉద్యమాలు మరియు పార్టీ బలోపేతంపై కూడా నాయకులు అభిప్రాయాలు చెప్పడం జరిగింది.

# రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**రామాయంపేట జూన్ 1 మహాప్రభ**
రామాయంపేట మున్సిపల్ పరిధిలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ లో మున్సిపల్ చైర్ పర్సన్ గాజవాడ లావణ్య నాగరాజు గారు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పి ఎస్ ఎస్ చైర్మన్ మరియు సీఈఓ పుట్టి నరసిములు. డైరెక్టర్లు పోచమ్మ ఐలయ్య .సుధాకర్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోచమ్మ నవనీత గణేష్. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రమేష్ రెడ్డి గారు డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాగిరి గారు . కౌన్సిలర్ లు గజవాడనాగరాజు . గుగులోత్ రవి బైరం స్వప్న కుమార్ గారూ. మద్దెల మాధవి రమేష్. కో ఆప్షన్ సభ్యులు చింతల రాధా భవాని . దేమ యాదగిరి గారు. గౌస్ గారు అధ్యక్షులు మహేందర్ రెడ్డి గారు పట్టణ అధ్యక్షులు చింతల సప్న స్వామి మోబిన్ సందు శివ. ఎలిశెట్టి అశోక్ సిద్ది రాములు తొండవాలి యాదగిరి పచ్చంటి రాము. సాధన పరశురాములు ప్రారంభం బైరమ్ శంకర్ చిలుక విరాట్ దా కి నాగేంద్ర ఈ యొక్క కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పిఎసిఎస్ డైరెక్టర్లు. సీఈఓ పుట్టి నర్సింలు పోచమ్మల ఐలయ్య . సుధాకర్ రెడ్డి . పిఎసిఎస్ చైర్మన్ గారు ప్రారంభించారు ఇకనుండి త డా చిన ధాన్యాన్ని. కొనుగోలు చేస్తామని మున్సిపల్ చైర్మన్ అన్నారు ఎవరు కూడా ధాన్యం గురించి ఆందోళనకు గురి కావద్దని ఆయన అలాగే ప్రతి ఒక్క గింజ వరకు కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు

# తూప్రాన్ మున్సిపల్ లో ఒకరికి బదిలీ వీడ్కోలు మరొకరికి స్వాగతం

-స్వాగతం పలికిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్



**తూప్రాన్ జూన్ 01(మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్లకు ఒకరికి బదిలీ మరొకరికి స్వాగతం పలికిన మున్సిపల్ చైర్మన్ అంకిత భావంతో విధులు నిర్వహించిన కమిషనర్ గణేష్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన చైర్మన్ తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి బదిలీ అయి వెళుతున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి నూతన కమిషనర్ గా వచ్చిన రమేష్ స్వాగతం పలికిన మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్ పర్సన్ సమత కాశి రెడ్డి మరియు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరంజన్ మృతి చాలా బాధాకరం

-బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు
- కేతావత్ భీల్యానాయక్



**దేవరకొండ డివిజన్ ( మహాప్రభ ) జూన్01**
చందంపేట మండలం లోని చిత్రియల గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్త సాగని నిరంజన్ మృతి చాలా బాధాకరం అని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు నిరంజన్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట చిత్రియాల గ్రామ సర్పంచ్ చాట్ల చిరంజీవి ,సీనియర్ నాయకులు బోయన పల్లి రాములు గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అప్పల రామ లింగం, చిన్న అంజయ్య, బోయపల్లి రజిని కాంత్, ఎరుకలి సత్యనారి గౌడ్, ఎరుకల సత్యం, కండె వెంకటయ్య, తుమ్మల వెంకటయ్య నిరంజన్, వార్డు సభ్యులు మార్క్ యాదయ్య, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు

# నూతన బోరు మోటారు బిగింపు ..



**పాపన్నపేట, జూన్ 1 ( మహాప్రభ )**
మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో పాపన్నపేటకు రెండు నూతన బోరు మోటర్లు వచ్చినట్లు పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ తెలిపారు. సోమవారం గ్రామం లోని బుడగ జంగం కాలనీలో వార్డు సభ్యులతో కలిసి ఆమె బోరు మోటరు ను ప్రారంభించారు. నీటి సరఫరా కావడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, వార్డు సభ్యులు, నాయకులు..శ్రీను,శ్రీరామ్ దుర్గయ్య,చోటు,రాజు ,కిష్టయ్య, దోసని సంగమేశ్వర్,శివయ్య,ప్రవీణ్ గౌడ్,పోచయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ చెస్ రంగంలో తెలంగాణ చిన్నారి సంచలనం


**-అతి చిన్న వయస్సులోనే రెండు ప్రపంచ రికార్డులు సొంతం**

**-120 చెస్ టేబుళ్లను 8 నిమిషాల 56 సెకండ్లలో పూర్తి చేసి చరిత్ర సృష్టించిన అశ్విక గౌడ్**

**-మంత్రుల ప్రశంసలు**

**-తల్లిదండ్రులు, గురువులకు ఘన సన్మానం**

**-'పువ్వు పుట్టగానే పరిమళించింది' అనిపించిన బాల మేధావి**





**హైదరాబాద్, జూన్ 01(మహాప్రభ)**
తెలంగాణ గడ్డ మరోసారి ఓ అరుదైన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన బాల మేధావి అశ్విక గౌడ్ తన అసాధారణ ప్రతిభతో ప్రపంచ చెస్ రంగంలో సంచలనం సృష్టించింది. బుడి బుడి అడుగులు వేసిన చిన్న వయస్సులోనే మేధస్సు, ఏకాగ్రత, చురుకుదనం, పట్టుదలతో చెస్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఈ చిన్నారి తాజాగా రెండు అంతర్జాతీయ ప్రపంచ రికార్డులను సాధించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది.

సాధారణంగా ప్రపంచ స్థాయి రికార్డులు సాధించాలంటే ఎన్నో సంవత్సరాల కఠోర సాధన, అనుభవం, పోటీలు అవసరం. అయితే అశ్విక గౌడ్ చిన్న వయస్సులోనే ఆ స్థాయికి చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక చెస్ చాలెంజ్‌లో 120 చెస్ టేబుళ్లను కేవలం 8 నిమిషాల 56 సెకండ్లలో పూర్తి చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ అద్భుత ప్రదర్శనతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ -- లండన్ మరియు ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్సీ సంస్థల నుంచి ప్రపంచ రికార్డు గుర్తింపును పొందింది. ఈ విజయంతో అశ్విక పేరు అంతర్జాతీయ స్థాయిలో మారుమోగుతోంది. చెస్ ప్రపంచంలో పెద్దలు మాత్రమే కాదు, క్రీడా నిపుణులు, విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు కూడా ఈ చిన్నారి ప్రతిభను కొనియాడుతున్నారు.

**చిన్నారి లో చిన్న వయస్సులోనే వెలుగొందిన అసాధారణ ప్రతిభ**

అశ్విక గౌడ్ బాల్యం నుంచే మేధో క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచింది. ఇతర పిల్లలు ఆటపాటలతో కాలం గడుపుతుంటే, అశ్విక మాత్రం చెస్ బోర్డు ముందు గంటల తరబడి కూర్చుని ఎత్తులు, వ్యూహాలు నేర్చుకునేది. ఒక కదలిక వెనుక దాగి ఉన్న అవకాశాలను గుర్తించే నైపుణ్యం చిన్న వయస్సులోనే ఆమెలో కనిపించింది.

చెస్ అనేది కేవలం ఆట మాత్రమే కాదు. అది ఏకాగ్రత, సహనం, వ్యూహాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యానికి ప్రతీక. అలాంటి ఆటలో ప్రపంచ రికార్డులు సాధించడం అంటే అసాధారణ మేధస్సుకు నిదర్శనం. ఆ ప్రతిభను అశ్విక ఎంతో చిన్న వయస్సులోనే నిరూపించింది.

**గురువుల శిక్షణ -- విజయానికి పునాది**

అశ్విక విజయానికి వెనుక ఉన్న ప్రధాన శక్తి ఆమె గురువుల కృషి. డైమండ్ చెస్ అకాడమీకి చెందిన పల్లె అంకిత గౌడ్ మరియు దివ్యశ్రీ అందించిన ప్రత్యేక శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం ఆమెను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. చెస్‌లో ప్రతి కదలికను శాస్త్రీయంగా విశ్లేషించడం, వేగం పెంచడం, ఏకాగ్రతను నిలబెట్టుకోవడం, ప్రత్యర్థి ఎత్తులను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో గురువులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆ శిక్షణ ఫలితంగానే అశ్విక ప్రపంచ రికార్డులను అందుకుంది.

**తల్లిదండ్రుల ప్రోత్సాహం -- విజయానికి బలమైన అండ**

పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. అశ్విక విషయంలో ఆమె తల్లిదండ్రులు అక్షిత గౌడ్, సాయి హితార్థ గౌడ్ అదే చేశారు. చిన్న వయస్సులోనే కూతురి ప్రతిభను గుర్తించి చెస్ శిక్షణ అందించారు. అవసరమైన ప్రతి సదుపాయం కల్పిస్తూ ఆమె లక్ష్యసాధనలో అండగా నిలిచారు.

విజయవంతమైన క్రీడాకారుడి వెనుక కుటుంబం ఎంత ముఖ్యమో అశ్విక ప్రయాణం మరోసారి నిరూపించింది.

**తాత పల్లె రామచంద్రం గౌడ్ ఆనందానికి అవధులు లేవు**

ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్ మనవరాలిగా అశ్విక కుటుంబంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. మనవరాలు ప్రపంచ రికార్డులు సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

చిన్నారి సాధించిన ఘనత కుటుంబానికే కాదు, రామాయంపేట పట్టణానికి, మెదక్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

**మంత్రుల చేతుల మీదుగా ఘన సన్మానం**

హైదరాబాద్ లోని మినిస్టర్స్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లిఅశ్విక గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించిన మంత్రులు,లి చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయి రికార్డులు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ చెస్ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యులను కూడా శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**రామాయంపేట నుంచి ప్రపంచ వేదిక వరకు**

ఒక చిన్న పట్టణంలో ప్రారంభమైన ప్రయాణం నేడు ప్రపంచ వేదిక వరకు చేరడం అశ్విక పట్టుదలకు నిదర్శనం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ స్థాయి ప్రతిభ వెలుగులోకి రావచ్చని ఈ చిన్నారి నిరూపించింది.

అశ్విక విజయం ప్రస్తుతం తెలంగాణలోని వేలాది మంది విద్యార్థులకు, చెస్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. కష్టపడి సాధన చేస్తే అసాధ్యం ఏదీ లేదని ఆమె ప్రయాణం చెబుతోంది.

**క్రీడా స్ఫూర్తికి చిరునామా**

నేటి యువతకు అశ్విక గౌడ్ ఆదర్శంగా నిలుస్తోంది. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న కాలంలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ రికార్డులు సాధించడం గొప్ప విషయమని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

చెస్ క్రీడ ద్వారా మేధస్సు, ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యం పెరుగుతాయని, అలాంటి క్రీడలో చిన్నారి సాధించిన విజయం మరెందరికో ప్రేరణగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

**భవిష్యత్తు ప్రపంచ ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్ష**

ప్రపంచ రికార్డులతో ప్రారంభమైన అశ్విక గౌడ్ ప్రయాణం ఇక్కడితో ఆగిపోవడం లేదు. జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో భారతదేశానికి పతకాలు సాధించి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. "పువ్వు పుట్టగానే పరిమళించింది" అనే నానుడికి అశ్విక గౌడ్ సజీవ నిదర్శనం. చిన్న వయస్సులోనే ప్రపంచ రికార్డులు సాధించిన ఈ బాల మేధావి భవిష్యత్తులో భారత చెస్ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచే పేరు కావాలని రాష్ట్ర ప్రజలు, క్రీడాభిమానులు, గురువులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు.

## ఆర్డీవో ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసిన సిడిపిఓ




**దేవరకొండ జూన్ 1( మహాప్రభ )**
దేవరకొండ ఆర్డీవో ఆర్డీవోను దేవరకొండ సిడిపిఓ చంద్రకళ సోమవారం ప్రజావాణి కార్యక్రమాల్లో పాల్గొని ఆర్డీవో కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామ గ్రామాన తాండ తాండన తీసుకెళ్లాలని సిడిపిఓ కు సూచించారు.

## మానవత్వం చాటుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**-రోడ్డు ప్రమాద క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలింపు**

**-మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం**



**దేవరకొండ జూన్ 1( మహాప్రభ )**
దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలు నాయక్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. పట్టణంలోని ఆర్డీవో ( ఆర్ డి ఓ ) కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్న ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్ వెంటనే స్పందించారు. తన కాన్వాయ్‌ను ఆపి, క్షతగాత్రుల వద్దకు వెళ్లారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, గాయపడిన వారిని స్వయంగా తన సొంత వాహనంలోనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, క్షతగాత్రులకు అత్యవసరంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారికి ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రమాద సమయంలో ప్రజాప్రతినిధిగా కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా స్పందించి సకాలంలో ఆసుపత్రికి చేర్చిన ఎమ్మెల్యే మానవత్వాన్ని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు అభినందిస్తున్నారు.

## పెద్దగట్టు లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం పేదల సొంతింటి కల సాకారం



**దేవరకొండ డివిజన్ జూన్ 1 ( మహాప్రభ**
పీఏపల్లి మండల పరిధిలో పెద్దగట్టు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదవాడి సొంతింటి కల నిజమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, దేవరకొండ శాసనసభ్యులు నేనవత్ బాలు నాయక్ పర్యవేక్షణలో నియోజకవర్గంలో 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం వేగంగా దూసుకుపోతోంది. ఇందులో భాగంగా పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ రమావత్ పద్మ నారాయణ అధికారికంగా ప్రారంభించి, లబ్ధిదారుడితో గృహప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమావత్ పద్మ నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తోందని కొనియాడారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన, ఆత్మగౌరవ జీవనాన్ని అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని పారదర్శకంగా అందజేస్తామని స్పష్టం చేశారు. సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారుల కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో పెద్దగట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రవి కుమార్, స్థానిక వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ మందిర నిర్మాణానికి విరాళం...



**శివంపేట,జూన్ 1 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని లింగోజిగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ మందిర నిర్మాణానికి తాజా మాజీ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా 50000 రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు..ఈ సందర్భంగా పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు అరవింద్ గౌడ్, రాజు నాగరాజు నరహరి భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్ల ఆలస్యంపై రైతుల ఆగ్రహం



**గన్నేరువరం, 01జూన్ (మహాప్రభ**
హనుమాజిపల్లి గ్రామ రైతులు స్థానిక డిసిఎంఎస్ కేంద్రంలో వడ్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నందుకు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.జంగపెల్లి ఐకెపి కేంద్రంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ సిబ్బంది కమిషన్ల కోసం వడ్లు కొనుగోలు చేయవద్దని చెబుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ నెల 20న తూకం వేయాల్సిన వడ్లు ఇప్పటివరకు తూకం వేయకపోవడంతో వర్షం పడితే పంట నష్టపోతుందని వారు వాపోయారు. తమ పంటలకు నష్టం వాటిల్లకముందే వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేశారు.వడ్ల కొనుగోళ్లలో జాప్యం రైతులలో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు.



**మెదక్ జిల్లా - 01జూన్ (మహాప్రభ**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మెదక్ పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఏఆర్ రంగనాథ్ ఆధ్వర్యంలో సోమవారం మెదక్ బస్టాండ్, రైల్వే స్టేషన్, జిల్లా కలెక్టరేట్‌లో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. స్నిఫర్ డాగ్ 'సింబ' సహాయంతో ప్రాంగణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు నర్సింలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


## క్షణికావేశంలో ప్రాణాలుకోల్పోయిన చెంచు యువకుడు పరమేష్



**అమ్రాబాద్,01జూన్ (మహాప్రభ**
అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మల్లాపూర్ చెంచుపెంటలో విషాదం చోటుచేసుకుంది. బైక్ విషయంలో తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన మడ్డి పరమేష్ (22) ఆవేశంలో తనపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు.తీవ్ర గాయాలపాలైన పరమేష్‌ను కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చొరవతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరమేష్ మృతి చెందాడు.మృతదేహాన్ని చెంచుపెంటకు తరలించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోయిన పరమేష్ మృతిపై గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# బిజినెస్

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



భారతీయ స్టాక్ మార్కెట్ల కు సోమవారం నాటి ట్రేడింగ్ తీవ్ర నిరాశ మిగిల్చింది. ఉదయం పూట అంతర్జాతీయ మార్కెట్ల మద్దతుతో 500 పాయింట్లకుపైగా లాభపడి సరికొత్త రికార్డుల వైపు పయనిస్తుందనుకున్న దలాల్ స్ట్రీట్.. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పూర్తిగా బేరిష్ జోన్‌లోకి జారుకుంది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి ఒక్కసారిగా తీవ్రం కావడంతో మార్కెట్లు తమ లాభాలన్నింటినీ కోల్పోయి భారీ నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఇ సెన్సెక్స్ , ఎన్ఎస్ఇ నిఫ్టీ రెండు సూచీలు కూడా నష్టాల్లోనే స్థిరపడ్డాయి.ఉదయం 23,700 మార్కును తాకిన నిఫ్టీ ముగింపు సమయానికి పతనమై 23,400 స్థాయి కంటే దిగువన ముగిసింది.సెన్సెక్స్ 500 పాయింట్ల మేర పతనమైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మార్కెట్ ఇంతలా కుప్పకూలడానికి ప్రధానంగా పశ్చిమాసియా పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయనుకుంటున్న తరుణంలోనే, ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకోవడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇరాన్ రాడార్, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా.. దానికి ప్రతిగా కువైట్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లను భయాందోళనలకు గురిచేశాయి. ఈ యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ (ముడిచమురు) ధరలు బ్యారెల్‌కు 93 డాలర్ల మార్కును తాకడం ద్రవ్యోల్బణ భయాలను మరింత పెంచింది. దీనికి తోడు గత శుక్రవారం ఏకంగా 21,000 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పెట్టుబడిదారులు , ఈ రోజు మధ్యాహ్నం తర్వాత కూడా లార్జ్-క్యాప్ షేర్లలో తమ అమ్మకాలను ఉధృతం చేశారు.

## మహిళలకు గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు..!

మీరు బంగారం, వెండిని కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నట్లయితే ఈ వార్త మీ కోసమే. సోమవారం, జూన్ 1, 2026న బంగారం, వెండి ధరలలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచ మార్కెట్ పోకడలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి స్థానం, దేశీయ డిమాండ్ అన్నీ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. తాజాగా తులం బంగారం ధరపై భారీగా తగ్గింది. ఏకంగా 820 రూపాయల వరకు దిగి వచ్చింది. వెండి అయితే కాస్త పెరిగింది.బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు కూడా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ ప్రకారం, 24 క్యారెట్ల బంగారం ధర రూ.820 తగ్గి 1,56,220 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. అదేవిధంగా, 22 క్యారెట్ల బంగారం ధర 750 రూపాయలు తగ్గి 1,43,200 రూపాయలకు చేరగా, 18 క్యారెట్ల బంగారం ధర 610 రూపాయలు తగ్గి 1,17,170 రూపాయలకు చేరింది. వెండి కిలోకు 2,80,000 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.వెండిని



ఆభరణాలలోనే కాకుండా అనేక పరిశ్రమలలో కూడా ఉపయోగిస్తారు. అందువల్ల పారిశ్రామిక రంగంలో వెండికి మరింత డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల డిమాండ్ కారణంగా రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,56,220 రూపాయలు ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 1,43,200 రూపాయల వద్ద కొనసాగుతోంది. అదే వెండి ధర విషయానికొస్తే.. ఇతర ప్రాంతాలకంటే హైదరాబాద్, చెన్నై, కేరళలో కిలో వెండి ధర 2,90,000 రూపాయల వద్ద ట్రేడవుతోంది.అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు సంబంధించిన పరిణామాలు, ఇటీవలి ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల అంచనాల కారణంగా బంగారం, వెండి ధరలలో ప్రభావం ఏర్పడుతోందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ హరీష్ వి తెలిపారు. దేశీయ మార్కెట్లో పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ అంచనాల కారణంగా ఈ విలువైన లోహాల ధరలు మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.

## మే నెలలో వసూళ్లు ఎన్ని లక్షల కోట్లంటే..!

### దేశంలో నిలకడగా జీఎస్టీ వసూళ్లు.

దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ.1.88 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్ల తో పోలిస్తే ఇది 3.2 శాతం అధికమని తెలిపింది. రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 3.3 శాతం ఎక్కువ.ఏప్రిల్‌లో నమోదైన రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గింది. అయితే ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం ముగింపు తర్వాత మే నెలలో వసూళ్లు తగ్గడం సాధారణమేనని అధికారులు తెలిపారు. ఈసారి జీఎస్టీ వసూళ్లలో దిగుమతులు




కీలక పాత్ర పోషించాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ.1.34 లక్షల కోట్లుగా నమోదు కాగా.. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ.59,654 కోట్లకు చేరుకోవడం గమనార్హం. మే నెలలో మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం పెరిగి రూ.27,281 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే) స్థూల జీఎస్టీ వసూళ్లు 6.2 శాతం వృద్ధితో రూ.4.37 లక్షల కోట్లకు చేరాయి.

## ఆర్సీబీ స్టార్‌కు భారీ జరిమానా.. 20వ సీజన్ తొలి మ్యాచ్‌కు దూరం..!

ఐపీఎల్ చరిత్రలో వరసగా రెండోసారి ట్రోఫీ గెలిచిన మూడో జట్టుగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కు బిగ్ షాక్. అదిరే విజయంతో విక్టరీ సంబురాల్లో మునిగిపోయిన ఆ జట్టులోని విదేశీ ఆటగాడు టిమ్ డేవిడ్ పై వేటు పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన అతడు వచ్చే సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధానికి గురయ్యాడు. లెవల్ 1 తప్పిదానికి పాల్పడిన డేవిడ్‌కు మ్యాచ్ ఫీజులో ఏకంగా 50 శాతం కోతతో పాటు.. రెండు డీ మెరిట్ పాయింట్లు కేటాయించారు.అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం(మే 31) జరిగిన ఫైనల్లో టిమ్ డేవిడ్ ఐపీఎల్ కోడ్‌ను ఉల్లంఘించాడు. గుజరాత్ ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్లో అతడు ఐస్ ప్యాక్‌ను కోపంగా అంపైర్ నితిన్ మీనన్(చీఞఱఅ వీవఅశీఅ) వైపు విసిరాడు. ఆర్సీబీ స్టార్ తీరును తప్పుబట్టిన మ్యాచ్ రిఫరీ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాడు. ఆర్టికల్ 2.9 ప్రకారం క్రికెట్ వస్తువులను దెబ్బతీయడం.. మ్యాచ్ అధికారి, అంపైర్, రిఫరీలను గాయపరిచేలా ప్రవర్తించడం వంటి వాటిని నేరంగా పరిగణిస్తారు.ఇన్నింగ్స్ మధ్యలో డేవిడ్ కోపంగా అంపైర్ నితిన్ వైపు ఐస్ ప్యాక్ విసరడం



కూడా ఆర్టికల్ 2.9 కిందకే వస్తుంది. దాంతో.. అతడికి మ్యాచ్ ఫీజులో సగం కోత విధించారు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో అభ్యంతరమైన సంజ్ఞలతో ఒకటి, 54వ మ్యాచ్‌లో రెండు డీమెరిట్ పాయింట్లకు తోడు.. తాజా నేరానికి మరో రెండు కలిపి మొత్తం.. ఐదు డీమెరిట్ పాయింట్లు అయ్యాయి. ఫలితంగా.. 20వ సీజన్‌లో ఆర్సీబీ తొలి మ్యాచ్‌లో ఆడడానికి టిమ్ డేవిడ్‌ను అనర్హుడిగా ప్రకటించారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ మార్పు.. జూన్ కాదు ఫిబ్రవరిలో..!

అంతర్జాతీయ క్రికెట్ మండలి తొలిసారి నిర్వహించ తలపెట్టిన మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ తేదీ మారింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది జూన్‌లో టోర్నమెంట్ జరగాలి. కానీ, ఈ మెగా ఈవెంట్‌ను అంతకంటే ముందుగానే ఆడించాలని ఐసీసీ తీర్మానించింది. 2027 ఫిబ్రవరిలో 10 జట్లతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలని నిర్ణయించింది. ఐపీఎల్ 19వ సీజన్ ఫైనల్ అనంతరం అహ్మదాబాద్‌లో జరిగిన త్రైమాసిక సమావేశంలో ఐసీసీ పెద్దలు షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపారు.వరల్డ్‌కప్ వంటి ఐసీసీ ఈవెంట్లలో సమాన నగదు బహుమతితో మహిళా క్రికెట్ అభివృద్ధికి బాటలు వేసిన ఐసీసీ ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీతో అతివల ఆటను మరో మెట్టు ఎక్కించాలనుకుంటోంది. అందులో భాగంగానే వచ్చే ఏడాది(2027) జూన్ -- జూలైలో టోర్నీ జరపాలని ఐసీసీ భావించింది. కానీ, ఫిబ్రవరిలో ఈ మెగా టోర్నీని నిర్వహించాలని




నిర్ణయించింది.అహ్మదాబాద్‌లో ఆదివారం అధ్యక్షుడు జై షా(జీఱఅ రాష్ట్రుష్ట్ర) నేతృత్వంలో సమావేశమైన ఐసీసీ సభ్యులు షెడ్యూల్ మార్చాలని, ఫిబ్రవరిలో 10 జట్లతో టోర్నీ జరపాలని తీర్మానించారు. దాంతో.. 2027 ఫిబ్రవరిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేటెడ్ దేశాలు.. మొత్తం 10 జట్లు ఛాంపియన్స్ ట్రోఫీ తొలి సీజన్‌లో తలపడనున్నాయి.


**జూన్ 12 నుంచి**

తొలుత 8 జట్లతో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని జరపాలని 2022లో ఐసీసీ భావించింది. మహిళా క్రికెట్ సభ్య దేశాలు అందుకు అంగీకరించడంతో 2027 జూన్‌లో టోర్నీ నిర్వహించాలని అనుకున్నారు. అయితే.. న్యూజిలాండ్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఆరు మ్యాచ్‌లు ఆడనుంది. అదే సమయంలో జూన్ 12 నుంచి మహిళల పొట్టి ప్రపంచకప మొదలవ్వనుంది. దాంతో, ఛాంపియన్స్ ట్రోఫీని ఫిబ్రవరిలో జరపడమే సబబు అని ఐసీసీ బృందం ఆలోచన చేసింది.

# స్పోర్ట్స్


## ఫ్రెంచ్ ఓపెన్‌లో దూసుకెళ్తున్న బాలాజీ..

### యుకీ బాంబ్రీ జోడీ ఓటమి..!



భారత డబుల్స్ ఆటగాడు ఎన్.శ్రీరామ్ బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్‌లో దూసుకెళు న్నాడు. మార్సెలో డెమొలినర్(బ్రెజిల్)తో జోడీ కట్టిన బాలాజీ అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టాడు. సోమవారం జరిగిన మూడో రౌండ్‌లో ఈ ద్వయం ఆరో సీడ్‌కు షాకిచ్చి ముందంజ వేసింది. జూనియర్ పోటీల పురుషుల సింగిల్స్ భారత్‌కు చెందిన ఆర్ణవ్ పపర్కర్ 16వ రౌండ్‌కు అర్హత సాధించాడు. కానీ, యుకీ బాంబ్రీ జంటకు డబుల్స్‌లో ఓటమి ఎదురైంది.ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో శ్రీరామ్ బాలాజీ జోరు చూపిస్తున్నాడు. పురుషుల డబుల్స్‌లో మార్సెలో డెమొలినర్‌తో కలిసి వరసగా మూడో విజయంతో క్వార్టర్ ఫైనల్ చేరాడు. సోమవారం ఆరో సీడ్ కెవిన్ క్రవిట్జ్ -- టిమ్ పుయెట్జ్ జంటను చిత్తు చేసింది బాలాజీ -- మార్సెలో జోడీ.తొలి సెట్ నుంచి ఆధిపత్యం చెలాయించి 7-5, 6-4తో వరస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించి క్వార్టర్స్ చేరింది బాలాజీ -- మార్సెలో జోడీ. మరో మ్యాచ్‌లో యుకీ బాంబ్రీ -- మైఖేల్ వీనస్(న్యూజిలాండ్) ద్వయం అనూహ్యంగా కంగుతిన్నది. ఇటలీ జంట సొమొనె బొలెల్లీ -- అండ్రీయ వవస్సోరి చేతిలో 3-6, 4-6తో ఓటమి పాలైంది.

# పెద్దిలో స్పోర్ట్స్‌కే ప్రాధాన్యం




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని విడుదల దగ్గర పడుతుందడడంతో సోషల్ మీడియాలో రోజుకో వార్త వైరల్ అవుతోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లోని సూపర్ హిట్ సాంగ్ 'అబ్బనీ తియ్యనీ దెబ్బ'ను ఇందులో రీక్రియేట్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ దీనిపై స్పందించారు. మీరు కొన్ని విషయాలు బిగ్‌స్క్రీన్ మీద చూసి తెలుసుకోవాలి. మేం ఆ పాటను రీక్రియేట్ చేయలేదు. కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. అలాంటివి అన్నీ యాడ్ చేస్తే ఇది మరీ కమర్షియల్ సినిమా అవుతుంది. అది ఐకానిక్ సాంగ్' అని చరణ్ అన్నారు. ఇక 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. 'క్రీడలపై పూర్తి ఫోకస్‌తో ఉంటూ వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు దీన్ని కచ్చితంగా చూడాలి. థియేటర్ నుంచి భావోద్వేగంతో బయటకు వస్తారు. వీక్ మైండ్ ఉన్నవాళ్లు కూడా చాలా స్ట్రాంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. జీవితంలో అత్యంత కష్టమైన సమయాలను ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై స్పష్టమైన ఆలోచన వస్తుంది. మనకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా జీవితం ముందుకు సాగిపోవాలి అని 'పెద్ది' మనకు నేర్పుతాడు. ఈ జనరేషన్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయమిదని రామ్ చరణ్ తెలిపారు. ఇక, తండ్రి చిరంజీవిని చూసి ఎంతో స్ఫూర్తి పొందానని రామ్ చరణ్ చెప్పారు. ఆయన లేకపోతే తన జీవితమే లేదన్నారు. బాబాయ్ పవన్ కల్యాణ్‌ను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు.

# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.



# అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.


# పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్



కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## అప్పుడే మరో సినిమా..

# గోపీచంద్ 34 షూటింగ్ షురూ.. !




టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. సంకల్ప్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డెరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది. మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి రీసెంట్‌గా విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తుంది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామాగా సినిమా ఉండబోతుందని స్పష్టమవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com